సాక్షి నారాయణపేట

మంగళవారం : 8 : జూలై : 2025



జూరాల భద్రతకు చర్యలు

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు భద్రతకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

వివరాలు 8లో ▸



11 యూనిట్లలో విద్యుదుత్పత్తి

జూరాల ప్రాజెక్టు వద్ద 11 యూనిట్లలో విద్యుదుత్పత్తి చేపడుతున్నారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.6 /23.2

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

చివరలో మొండిచేయి..!

'ఇందిరమ్మ' ఆశావహులను వెంటాడుతున్న గతం

- 20 ఏళ్ల క్రితం లబ్ధిపొందారంటూ అనర్హులుగా తేల్చివేత
- అర్హులుగా చేర్చి.. ప్రొసీడింగ్‌లు సిద్ధమైన తర్వాత రద్దు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆందోళనలో వేలాది మంది..
- అప్పట్లో ఈ పథకంలో భారీ స్కాం.. పలువురు నేతల స్వాహా పర్వం
- తమకు తెలియకుండానే బిల్లులు మింగారని లబ్ధిదారుల గగ్గోలు
- ఆ జాబితా ప్రకారం ఏరివేయడంపై మండిపాటు



కూలగొట్టిన ఇంటి వద్ద కళావతి

ఈ ఫొటోలోని మహిళ పేరు కళావతి. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో నివసిస్తున్న ఆమె ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకుంది. ఇల్లు వస్తుందని ఓ కాంగ్రెస్ నాయకుడు హామీ ఇవ్వడంతో ధీమాగా శిథిలావస్థకు చేరిన ఇంటిని కూలగొట్టుకుంది. ఇల్లు నిర్మించుకునేందుకు సిద్ధమైన క్రమంలో సదరు నేత నీకు ఇందిరమ్మ ఇల్లు రాదని చెప్పడంతో కంగుతింది. అధికారుల చుట్టూ తిరిగిన క్రమంలో గతంలో నీ పేరిట ఇందిరమ్మ పథకం కింద ఇల్లు మంజూరైందని.. బిల్లులు కూడా డ్రా చేసుకున్నారని తేల్చేశారు. ఇప్పుడు ఈ పథకం నీకు వర్తించదని చెప్పడంతో ఆమె కన్నీరుమున్నీరవుతోంది. ఇందిరమ్మ ఇల్లు వస్తుందనే ఆశతో ఉన్న గూడును కూల్చుకున్నానని.. ఇప్పుడేం చేయాలో తోచడం లేదని 'సాక్షి'తో గోడు వెళ్లబోసుకుంది.

సాక్షి ఫోకస్

...ఈ పరిస్థితి ఆ ఒక్కరిదే కాదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రస్తుతం మొండి'చేయి' చూపడంతో ఉమ్మడి పాలమూరు జిల్లాలో వేలాది మంది ఆందోళనలో కొట్టుమిట్టాడుతున్నారు. గతం వెంటాడిన క్రమంలో బాధితులుగా మారిన ఇందిరమ్మ లబ్ధిదారుల దీనావస్థపై 'సాక్షి' ఫోకస్..

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అంటే సుమారు 20 ఏళ్ల క్రితం ఇల్లు లేని పేదవారికి గూడు కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ మేరకు లబ్ధిదారులు ఒక్కొక్కరికి గ్రామాల్లో అయితే రూ.45 వేల నుంచి రూ.70 వేలు, పట్టణాలు లేదా నగరాల్లో రూ.55 వేల నుంచి రూ.80 వేల చొప్పున ప్రభుత్వం మంజూరు చేసింది.

గతంలో భారీ స్కాం..

నగదుతో పాటు ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే సిమెంట్‌ను నామమాత్రపు ధరకు అందజేసింది. అయితే ఈ పథకంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా భారీ స్కాం వెలుగుచూసింది. అప్పట్లో ఇళ్లు పొందిన వారిలో కొందరు సిమెంట్ బస్తాలు, నగదు తీసుకున్నా.. ఇళ్లు నిర్మించుకోలేదు. మరికొందరు సిమెంట్ మాత్రమే తీసుకుని.. ఇళ్లు నిర్మించుకోలేదు. ఇంకొందరు ఇళ్ల నిర్మాణాలను మధ్యలోనే వదిలేశారు. మరోవైపు పలువురు గ్రామ, మండల, జిల్లాస్థాయిలో రాజకీయ నాయకులు దళారుల అవతారం ఎత్తి ఇందిరమ్మ నిధులను కాజేసిన ఉదంతాలూ వెలుగుచూశాయి.



మాగనూరులో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

తొలుత అర్హులు.. చివరలో అనర్హులు

ఉమ్మడి పాలమూరులోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట, వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో మొత్తం 40,867 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. ఇప్పటివరకు 30,285 మంది లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలు అందజేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. తొలుత అర్హుల జాబితాలో చేర్చిన పలువురు లబ్ధిదారుల పేర్లు చివరలో గల్లంతయ్యాయి. గతంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ప్రభుత్వ సాయం పొందిన వారివి ప్రస్తుతం రద్దు చేస్తున్నారు. ఈ విషయం ముందే చెప్పకుండా.. ప్రొసీడింగ్ కాపీలు అందజేసే క్రమంలో మీరు అర్హులు కాదని తేలిందని, మీకు ఇందిరమ్మ ఇళ్ల పథకం వర్తించదని అధికారులు చెబుతుండడంతో సదరు లబ్ధిదారుల్లో నిరాశనిస్పృహలు అలుముకున్నాయి. అర్హుల జాబితాలో చేర్చిన క్రమంలో ఇందిరమ్మ ఇళ్లు వస్తాయనే ఆశతో ఉన్న గూడును కూల్చుకున్న వారి పరిస్థితి దయనీయంగా మారింది.

విమర్శల వెల్లువ.. కాంగ్రెస్ నేతల ఉక్కిరిబిక్కిరి..

20 ఏళ్ల క్రితం నాటి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితా ఆధారంగా ప్రస్తుతం ఏరివేత చేపట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో తమకు తెలియకుండానే తమ పేరిట నాయకులు ఇందిరమ్మ డబ్బులు కాజేశారని కొందరు.. సిమెంట్ బస్తాలు ఇవ్వకుండా అమ్ముకున్నారని మరికొందరు ఆరోపిస్తున్నారు. అప్పుడు అవకతవకలకు పాల్పడిన నాయకులు, అధికారులపై చర్యలు చేపట్టకుండా..ఇప్పుడు అదే లబ్ధిదారుల జాబితా ప్రకారం అనర్హులంటూ తమను పథకానికి దూరం చేయడంపై పలువురు మండిపడుతున్నారు. ఈ క్రమంలో కొందరు గ్రామ, మండలస్థాయి కాంగ్రెస్ నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. గతంలో ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ హయాంలోనే ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అవకతవకలు చోటుచేసుకోవడం.. ప్రస్తుతం తెలంగాణలో ఆ పార్టీనే అధికారంలో ఉండడం.. అప్పటి జాబితా ప్రకారం అనర్హులను ఏరివేస్తుండడంతో వారికి ఏం చెప్పాలో తెలియక నాయకులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

జిల్లాల వారీగా ఇందిరమ్మ ఇళ్లు ఇలా..

జిల్లా	మంజూరు	ప్రొసీడింగ్స్ అందుకున్నవి	గ్రౌండింగ్ అయినవి
మహబూబ్‌నగర్	10,581	5,050	3,047
నాగర్‌కర్నూల్	10,732	8,230	3,646
నారాయణపేట	5,016	4,800	2,048
వనపర్తి	6,538	5,717	2,129
గద్వాల	8,000	6,488	1,876
మొత్తం	40,867	30,285	12,746

ఈ ఫొటోలోని మహిళ పేరు చాకలి లక్ష్మి. వనపర్తి జిల్లా అమరచింతకు చెందిన ఆమె భర్త శ్రీనివాసులు నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి బట్టలు ఇస్త్రీ చేస్తూ.. ఇద్దరమ్మాయిలను పోషిస్తోంది. వారు నివసిస్తున్న ఇల్లు కూలిపోవడంతో ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకోగా.. అర్హుల జాబితాలో ఆమె పేరును చేర్చారు. కానీ ప్రొసీడింగ్‌లు ఇచ్చేరోజు ఆమె పేరు లేదు. ఉమ్మడి రాష్ట్రంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని.. ఇక నీకు రాదని అధికారులు చెబుతున్నారని 'సాక్షి'తో వాపోయింది. 'అప్పట్లో ఇంటి బిల్లు రూ.35 వేలు ఇచ్చారంటా.. నాకు ఇచ్చింది రూ.15 వేలు మాత్రమే. కిరాయి ఇంట్లో ఉంటున్న నాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలి' అని వేడుకుంది.



ఈ ఫొటోలోని దళిత వృద్ధురాలి పేరు పంతగాని గౌరమ్మ. ప్రస్తుతం ఖిల్లాఘనపురంలో నివాసముంటున్న కట్టె కప్పు ఇల్లు పాతదైపోవడంతో చిన్న వాన కురిసినా ఇంట్లోకి నీటి(పాటుకు)చినుకులు పడుతున్నాయి. ఎక్కడ నీరు కారినా అక్కడ బకెట్లు, గిన్నెలు పెడుతున్నారు. ఈ ఇంటిలో వృద్ధురాలితో పాటు కుమారుడు రాము, కూతురు కవిత(దివ్యాంగురాలు) మనవడు ఆనంద్, మనవరాలు నందిని నివాసముంటున్నారు.



ఉన్న చిన్న ఇల్లు కురుస్తుండటంతో వర్షం వచ్చిన రాత్రి జాగరణ చేస్తున్నారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేరు వచ్చిందని చెప్పారు. అంతలోనే మీ పేరు ఈ జాబితాలో లేదని అధికారులు చెప్పడంతో.. సొంతిల్లు కట్టుకునే స్తోమత లేదని, ఇప్పుడేం చేయాలని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తోంది.

ఇప్పటివరకు 1,200 మంది అనర్హులు?

ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 12,746 ఇళ్లను అధికారులు గ్రౌండింగ్ చేశారు. ఇందులో 1,200 వరకు గతంలో ఇందిరమ్మ పథకంలో లబ్ధి పొందగా.. వారిని అర్హుల జాబితాలో నుంచి తొలగించినట్లు సమాచారం. పూర్తిస్థాయిలో గ్రౌండింగ్ పూర్తయితే ఈ సంఖ్య నాలుగింతలు కానున్నట్లు అంచనా. ఈ విషయాన్ని హౌసింగ్ అధికారులు అధికారికంగా వెల్లడించడం లేదు. గతంలో ఇందిరమ్మ పథకంలో లబ్ధిపొందిన వారికి ప్రస్తుతం ఇళ్లు ఇవ్వడం లేదని చెబుతున్నారు. గతంలో పునాది వరకు నిర్మించుకుని వదిలేసిన వారికి ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు.

న్యూస్‌రీల్

దరఖాస్తు చేసుకోండి

నారాయణపేట: జిల్లాలోని నిరుద్యోగ **యువతకు** టీజీఏబీసీడీసీ ఆధ్వర్యంలో **వలు అంశాలపై** ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు **జిల్లా వెనకబడిన** తరగతుల సంక్షేమశాఖ అధి**కారి అబ్దుల్** ఖలీల్ సోమవారం ఒక ప్రకటన**లో తెలిపారు.** స్కిల్ కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్ **ట్రైనింగ్,** పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కమ్యూనికేషన్ ఫౌండేషన్, మాక్ ఇంటర్వ్యూలు, మెంటల్ వెల్‌నెస్ ట్రైనింగ్ అంశాలపై నాలుగు రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. 21 నుంచి 30 ఏళ్ల వయసు కలిగి, ఏదైనా డిగ్రీ చదివిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 12వ తేదీలోగా tgobmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుతో పాటు ఇతర ధ్రువపత్రాలను జిల్లా బీసీ సంక్షేమశాఖ కార్యాలయంలో 14వ తేదీలోగా అందజేయాలని తెలిపారు.

మైనార్టీల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి



కోస్గి రూరల్: మైనార్టీల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని ముశ్రీఫా గ్రామంలో మైనార్టీ మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనార్టీ కార్పొరేషన్ ద్వారా అందించే కుట్టుమిషన్లకు 55 మంది దరఖాస్తు చేసుకోగా.. 44మందికి మంజూరైనట్లు తెలిపారు. మిగతా వారికి 10 రోజుల్లో మంజూరవుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నివర్గాలకు సమప్రాధాన్యం ఇస్తూ పథకాలను అమలు చేస్తుందని.. అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ తూం భీంరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గిరిప్రసాద్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, శశివర్ధన్, రామకృష్ణారెడ్డి, హబీబ్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు కాంగ్రెస్ కసరత్తు



కుసుమకుమార్

స్టేషన్ మహబూబ్‌నగర్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ కసరత్తు చేస్తోంది. ఎన్నికల్లో సత్తా చాటడానికి పార్టీ సన్నద్ధమవుతోంది. తెలంగాణ ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆమోదం మేరకు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ సోమవారం ఉమ్మడి జిల్లాల వారీగా ఇన్‌చార్జ్‌లను నియమించారు. ఈ క్రమంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జ్‌గా పార్టీ సీనియర్ నాయకుడు, పీఏసీ సభ్యుడు జె.కుసుమకుమార్ నియామకమరు. ఎన్నికల నేపథ్యంలో గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు కమిటీల నిర్మాణం చేపట్టనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడానికి ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ కీలకపాత్ర పోషించనున్నారు.

ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురు..

రాష్ట్రంలోని వివిధ ఉమ్మడి జిల్లాలకు మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురు నేతలు ఇన్‌చార్జ్‌లుగా నియామకం అయ్యారు. ఇందులో సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి ఖమ్మం, ఏఐసీసీ కార్యదర్శి ఎస్.సంపత్‌కుమార్ నల్లగొండ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ కె.శివసేనారెడ్డి రంగారెడ్డి జిల్లాలకు ఇన్‌చార్జీగా నియమితులయ్యారు.

పనిగంటల పెంపు జీఓను రద్దు చేయాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఎనిమిది గంటల పనికి బదులు 10 గంటల పని సమయం పెంచుతూ రాష్ట్ర కార్మిక శాఖ దొడ్డిదారిన తెచ్చిన జీఓ నం.282ను తక్షణమే రద్దు చేయాలని వామపక్ష కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. జీఓ నం.282పై వామపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జీఓ 282 ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సురేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి, టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్, టీఎన్‌టీయూ జిల్లా నాయకుడు రాములు మాట్లాడుతూ కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోసం దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు కాంగ్రెస్ మద్దతు ఇస్తూనే.. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం దొడ్డిదారిన కార్పొరేట్ యాజమాన్యాలకు అనుకూలంగా 10 గంటల పనివేళలు పెంచుతూ జీఓ జారీ చేయడం దుర్మార్గమని అన్నారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ



నారాయణపేట రూరల్: ప్రత్యేక అవసరాలు గల చిన్నారులపై తల్లిదండ్రులతో పాటు భవిత కేంద్రం నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా ఐఈ కోఆర్డినేటర్ రాజేంద్రకుమార్ సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు ఏర్పాటుచేసిన ఫిజియోథెరపి శిబిరాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. భవిత కేంద్రంలో ప్రతి సోమ, బుధవారం దివ్యాంగ చిన్నారులకు నిర్వహించే ఫిజియోథెరపి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రీతి, ఐఈఆర్పీ శ్రీనివాస్, ఎంఐఎస్ కరిష్మా, కంప్యూటర్ ఆపరేటర్ నారాయణ, సీఆర్పీ ఆరిఫ్ అహ్మద్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనుల్లో వేగం పెంచండి



దామరగిద్ద: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ట్రెయినీ కలెక్టర్ ప్రణయ్‌కుమార్ అన్నారు. దామరగిద్దలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను సోమవారం హౌసింగ్ పీడీ శంకరయ్యతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల వివరాలు, ఇళ్ల నిర్మాణ దశలు, మంజూరైన బిల్లుల వివరాలను తెలుసుకున్నారు. జిల్లావ్యాప్తంగా 5,223 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, దాదాపుగా నిర్మాణ దశలో ఉన్నాయని.. 153 మందికి రూ.లక్ష చొప్పున బిల్లులు మంజూరైనట్లు అధికారులు వివరించారు. ట్రెయినీ కలెక్టర్ వెంట హౌసింగ్ సిబ్బంది కాకర్ల భీమయ్య ఉన్నారు.

బాలకేంద్రంలో అడ్మిషన్లు

నారాయణపేట రూరల్: పట్టణంలోని బాలకేంద్రంలో 2025–26 సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5–16 ఏళ్ల విద్యార్థినీ విద్యార్థులకు సితార్, తబలా, గాత్రం, నృత్యంతో పాటు మరిన్ని కళల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రోజు సాయంత్రం 5నుంచి 7గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.20, ఓసీ, బీసీలు రూ.50 అడ్మిషన్ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాలి



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: వివిధ సమస్యలపై ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను నేరుగా కలెక్టర్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. మొత్తం 30 అర్జీలు అందగా.. పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు పంపించారు. కాగా, అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కార మార్గం చూపాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని మండల ప్రత్యేకాధికారులు విధిగా తనిఖీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పదోన్నతితో మరింత బాధ్యత : ఎస్పీ

నారాయణపేట క్రైం: ఉద్యోగులకు కల్పించే పదోన్నతులు మరిన్ని బాధ్యతలు పెంచుతాయని ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందిన భద్రూ నాయక్ సోమవారం ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన హెడ్ కానిస్టేబుల్‌ను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. నూతనోత్సాహంతో పనిచేస్తూ.. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీ రియాజ్ హుల్ హక్, ఆర్ఐ నర్సింహ పాల్గొన్నారు.



ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందిన భద్రూనాయక్‌ను అభినందిస్తున్న ఎస్పీ

⇨ జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎస్పీ యోగేష్ గౌతమ్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై ఆరు అర్జీలు అందజేయగా.. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులకు ఎస్పీ సూచించారు. ప్రజలకు పోలీసు శాఖను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. సమస్యలపై పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించి భరోసాగా కల్పించాలని తెలిపారు. పోలీసుల వద్దకు వచ్చే ఫిర్యాదుదారులు మధ్యవర్తులను తీసుకురావొద్దని.. బాధితులు నేరుగా సంప్రదించాలని ఎస్పీ సూచించారు.

రోడ్డు విస్తరణపై ఆందోళన



కడా అధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

మద్దూరు: మున్సిపాలిటీలో చేపట్టిన ప్రధాన రహదారి విస్తరణలో నివాసగృహాలు కోల్పోతున్న బాధితులు సోమవారం ఆందోళనకు దిగారు. స్థానిక పాతబస్టాండ్ చౌరస్తా నుంచి మున్సిపల్ కార్యాలయం గుండా చింతల్‌దిన్నె రోడ్డు వరకు ఉన్న రహదారిని 70 ఫీట్ల మేర విస్తరించేందుకు ఇటీవల అధికారులు మార్కింగ్ వేశారు. ఈ రోడ్డు విస్తరణతో దాదాపు 60 కుటుంబాలు నివాసగృహాలు కోల్పోనున్నాయి. ఈ నేపథ్యంలో రోడ్డు విస్తరణ ఆపాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు కడా అధికారి వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌ను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణతో తాము సర్వం కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు. బాధితులకు మద్దతుగా వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. కాగా, రోడ్డు విస్తరణపై మున్సిపల్, పీఆర్ అధికారులు అన్ని పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి.. బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని వివరించారు.

నేడు పీయూ మాల్‌ప్రాక్టీస్ కమిటీ భేటీ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూ పరిధిలోని డిగ్రీ సెమిస్టర్– 2, 4, 6, ఇంటిగ్రేటెడ్ బీఈడీ 2, 4, 6 పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన విద్యార్థులు మంగళవారం పీయూ మాల్‌ప్రాక్టిస్ కమిటీ ఎదుట హాజరుకావాలని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రవీణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుక్ అయిన విద్యార్థుల వివరాలను ప్రిన్సిపాల్స్ మెయిల్‌కు పంపించామని, వారు తప్పకుండా ఎగ్జామినేషన్ బ్రాంచ్‌లో, మాల్ ప్రాక్టిస్ చేసినందుకు గల కారణాలపై వివరణ ఇవ్వాలని సూచించారు.

ఆదివాసీ చెంచుల అభ్యున్నతే లక్ష్యం



ఆదివాసీ చెంచులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, చిత్రంలో ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, రాజేశ్‌రెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్

- ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇచ్చే బాధ్యత మాదే
- రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

మన్ననూర్: ఆదివాసీ చెంచుల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం అమ్రాబాద్ మండలం మన్ననూర్‌లోని గిరిజన భవన్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ, రాజేశ్‌రెడ్డితో కలిసి ఆయన ఆదివాసీ చెంచులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. నాడు, నేడు ఆదివాసీ చెంచులను అక్కున్న చేరుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. కాంగ్రెస్ హయాంలోనే ఎంతో మందికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి సొంతింటి కలను సాకారం చేశామని.. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇచ్చే బాధ్యత తీసుకుంటుందని అన్నారు. మన్ననూర్ ఐటీడీఏ పరిధిలో ఉన్న 5 జిల్లాల్లోని చెంచులతో పాటు రాష్ట్రంలోని ఐటీడీఏల పరిధిలో విడతల వారీగా 13,266 చెంచు కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఇంటి నిర్మాణ బిల్లులు రూ.5లక్షలతో పాటు అదనంగా మరో రూ.లక్ష అందిస్తామన్నారు.

గత ప్రభుత్వం హామీలకే పరిమితం: మంత్రి జూపల్లి

గత ప్రభుత్వం హామీలకే పరిమితమైంది తప్ప ఆచరణలో ఏ ఒక్క అభివృద్ధి పని చేపట్టలేదని మంత్రి జూపల్లి కృష్ణారావు విమర్శించారు. మాయ మాటలతో కాలయాపన చేసి రూ. 8 లక్షల కోట్ల అప్పు రాష్ట్ర ప్రజలపై పెట్టిందని ఆరోపించారు. గత పాలకులు చేసిన అప్పును కాంగ్రెస్ ప్రభుత్వం తీరుస్తూనే.. ఏడాదిన్నర కాలంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందన్నారు. పేదరిక నిర్మూలన కోసం చేయాల్సింది ఇంకా ఎంతో ఉందన్నారు. ప్రజలు ఆశీర్వదిస్తే మరో పదేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందన్నారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ.. దశాబ్దాలుగా పూరి గుడిసెల్లో నివాసం ఉంటున్న ఆదివాసీ చెంచుల సొంతింటి కలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నెరవేరుస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల పథకం పేద కుటుంబాలకు పండుగ వాతావరణం తీసుకొచ్చిందన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ రోహిత్ రెడ్డి, ఆర్డీఓ మాధవి, ఐటీడీఏ ఏఓ జాఫర్ హుస్సేన్, డీఈలు వెంకటేశ్వర సింగ్, హేమలత, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేచీకటితో బాధపడుతూ యువకుడి బలవన్మరణం

రాజోళి: రేచీకటితో బాధపడుతున్న యువకుడు మనోవేధనతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం చోటు చేసుకోగా.. సోమవారం కేసు చేసినట్లు ఎస్‌ఐ గోకారి తెలిపారు. ఎస్‌ఐ పేర్కొన్న వివరాల ప్రకారం.. రాజోళికి చెందిన కురవ అంజనేయులు సుజాత దంపతులకు ఇద్దరు సంతానం. కుమార్తెకు వివాహం కాగా.. కుమారుడు భాస్కర్(23)కు ఇంకా పెళ్లి కాలేదు. ఆయనకు రేచీకటిలో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం తల్లిదండ్రులు పొలానికి వెళ్తూ, తమ వెంట రావాలన్నారు. కానీ తర్వాత వస్తానని చెప్పిన భాస్కర్ ఇంట్లోనే ఉన్నాడు. కొద్దిసేటికి పురుగుల మందు తాగి వాంతులు చేసుకోగా చుట్టు పక్కల వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే బాధితుడిని కర్నూలులోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోకారి పేర్కొన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

పాన్‌గల్: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందిన ఘటన మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. మండలంలోని రేమద్దుల గ్రామానికి చెందిన సంగనమోని పరుశరాముడు(45) నిత్యం చేపలు పట్టి విక్రయించి వచ్చిన డబ్బుతో జీవనం సాగించేవాడు. ఇదే క్రమంలో ఈనెల 4వ తేదీన చేపల వేటకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఎంతకూ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారి దగ్గర, చుట్టు పక్కల వెతికినా ఎలాంటి ఆచూకీ లభించ లేదు. ఈక్రమంలో సోమవారం గ్రామ శివారులోని సింగాయిపల్లి రోడ్డు పక్కన నల్లకుంట చెరువులో మృతదేహం ఉందని గ్రామస్తులు తెలపడంతో అక్కడికి వెళ్లి పరిశీలించగా.. అది సంగనమోని పరుశరామునిదిగా గుర్తించారు. చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెంది ఉంటాడని, మృతుడి తల్లి సంగనమోని కోమలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి


రామకృష్ణ (ఫైల్)

అయిజ: పాముకాటుతో వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం రాత్రి మండలంలో చోటుచేసుకుంది. బంధువుల కథనం ప్రకారం.. మండలంలోని నౌరోజి క్యాంప్ గ్రామానికి చెందిన రామకృష్ణ(35) ఆదివారం ఉదయం ఇంటి బయట పనులు చేసుకుంటుండగా పాము కాటేసింది. పక్క గ్రామానికి చెందిన వ్యక్తి పాముకాటుకు మంత్రం వేశాడు. మంత్రం వేయించుకున్నాసరే చికిత్స చేయించుకోవాల్సిందేనని మంత్రం వేసిన వ్యక్తి రామకృష్ణకు చెప్పినా నిర్లక్ష్యం చేశాడు. విషం పాకుతున్నట్లు అనుమానం రావడంతో రాత్రి కుటుంబ సభ్యులకు తెలిపాడు. పట్టణంలోని పీహెచ్‌సీకి వెళ్లారు. పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న ఏఎన్‌ఎం బొజ్జమ్మకు పాముకాటు వేసిన విషయం తెలిపారు. గద్వాలకు వెళ్లాలని ఏఎన్‌ఎం చెప్పడంతో గద్వాలకు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతదేహానికి జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. రామకృష్ణకు భా ర్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. స కాలంలో ఇంజక్షన్ చేసి ఉంటే రామకృష్ణ బతికి ఉండేవాడని గ్రామస్తులు వాపోతున్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి దుర్మరణం

వనపర్తి రూరల్: బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. పెబ్బేర్ ఎస్‌ఐ యుగంధర్ రెడ్డి కథనం ప్రకారం.. పెబ్బేర్‌కు చెందిన అబ్దుల్ ఖదీర్ (31) ఏబీడీ కంపెనీలో అపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 6వ తేదీ రాత్రి బైక్‌పై మెకానికి వెంకటేశ్‌తో కలిసి ఖదీర్ చెలిమిల్లకు వెళ్తున్నట్లు చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. సోమవారం తెల్లవారుజామున బైక్‌పై శ్రీరంగాపూర్ నుంచి పెబ్బేర్‌కు వెళ్తూ కంచిరావుపల్లి మలుపు వద్ద బైక్ అదుపుతప్పి కిందపడడంతో తలకు బలమైన గాయాలై మృతిచెందాడు. మృతుడి భార్య సమదానీ బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో..

కొత్తకోట రూరల్: గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన కొత్తకోట మండలంలోని కనిమెట్ట ఎన్‌హెచ్ 44పై సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పెద్దమందడి మండల కేంద్రానికి చెందిన వెల్డింగ్ కృష్ణయ్య (48) మదనాపురం మండలంలోని తిర్మలాయపల్లిలో బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి కుమార్తె సింధుతో కలిసి వెళ్లాడు. కార్యక్రమం ముగించుకుని తిరిగి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా కనిమెట్ట సమీపంలో సాయిఅమృత దాబా వద్ద గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొనడంతో కృష్ణయ్యకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ వెనుక కూర్చున్న సింధు ఎగిరి కింద పడటంతో స్వల్ప గాయాలయ్యాయి. సింధు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. ఘటన స్థలానికి కుటుంబ సభ్యులు పోలీసుల సహకారంతో మృతదేహాన్ని వనపర్తి మార్చురీకి తరలించారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు.

జూరాల భద్రతకు చర్యలు

కృష్ణానదిపై అదనంగా హైలెవెల్ రోడ్డు బ్రిడ్జి


హైలెవెల్ రోడ్డు బ్రిడ్జి నిర్మాణం చేపట్టే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ శాఖ అధికారులు

- రూ.121.92 కోట్లు మంజూరు
- ఆర్‌అండ్‌బీకి నిర్మాణ పనుల అప్పగింత
- జూరాల, కొత్తపల్లి సమీపంలో వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు
- క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు

గద్వాల: ఇందిరా ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు.. మూడు దశాబ్దాలుగా ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజల తాగు, సాగునీటి అవసరాలను తీరుస్తూ.. ఎన్నో ప్రాజెక్టులకు అవసరమైన నీటిని ప్రత్యక్షంగా, పరోక్షంగా అందిస్తూ.. సుమారు 7 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించి బీడు భూములను సస్యశ్యామలం చేస్తుంది. ఇంతటి ప్రాధాన్యత ఉన్న జూరాల ప్రాజెక్టుకు కష్టం వచ్చిపడింది. 1996లో అందుబాటులోకి వచ్చిన తరువాత 30 ఏళ్ల కాలంలో ప్రాజెక్టు నిర్వహణను పాలకులు గాలికొదిలేశారు. ప్రాజెక్టు గేట్ల మరమ్మతు, భద్రతకు గుండెకాయ మాదిరిగా వ్యవహరించే గ్యాంటీ క్రేన్‌తోపాటు డ్యాంలోని సుమారు 26 గేట్లు నిర్వహణ లోపంతో దెబ్బతిని రిపేర్లకు గురయ్యాయి. వీటిని మరమ్మతు చేయాలనే ధ్యాసే లేకుండా పోయింది. అదేవిధంగా ప్రాజెక్టుపై ఉన్న బ్రిడ్జి నుంచి భారీ లారీలు, బస్సులు, ఇతర వాహనాలు 24 గంటల పాటు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో ప్రస్తుతం జూరాల బ్రిడ్జి ప్రమాదంలో పడింది. ఇదే విషయం ఏడేళ్ల కిందటే ప్రభుత్వానికి సంబంధిత అధికారులు నివేదిక పంపినా పట్టించుకోలేదు. ఇటీవల గేట్ల రోపులు తెగిపోవడం, ఆ విషయం కాస్తా మీడియాలో ప్రచురితమవడం, ప్రతిపక్ష రాజకీయ పార్టీల నేతల సందర్శించడంతో రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయంశమైంది. దీంతో ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పర్యటించి అదనంగా మరో బ్రిడ్జి నిర్మాణం చేపడతామని ప్రకటించారు. ఈమేరకు నిధులు మంజూరు చేయడంతో జూరాల పటిష్టతపై గట్టి చర్యలు మొదలయ్యాయి.

గేట్ల రోపులు తెగడంతో..

ఇటీవల ప్రాజెక్టుకు ముందస్తు వరద రావడంతో అప్పటికే రిపేర్లతో కొట్టుమిట్టాడుతున్న 26 గేట్లలో 4, 8వ నంబర్ల గేట్ల ఇనుప రోపులు తెగిపోయాయి. దీనిపై మీడియాలో ప్రముఖంగా కథనాలు ప్రచురితం కావడం, అన్ని రాజకీయ ప్రతిపక్ష పార్టీల నేతలు ఆందోళన వ్యక్తం చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఈ నేపథ్యంలో జూన్ 28వ తేదీన రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి జూరాల ప్రాజెక్టును సందర్శించారు. గేట్లతోపాటు, బ్రిడ్జిపై వాహనాల రాకపోకలను పరిశీలించారు. గతంలో అధికారులు పంపిన నివేదికల వివరాలను సంబంధిత అధికారులతో అడిగి తెలుసుకున్నారు. దీనిపై మంత్రి ఉత్తమ్ జూరాల ప్రాజెక్టుపై స్పందిస్తూ అదనంగా మరో రోడ్డు బ్రిడ్జి నిర్మాణం చేపడతామని ఇందుకోసం రూ.100కో ట్లు నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారు. ఈక్రమంలోనే ఈనెల 1వ తేదీన నూతన హైలెవెల్ రోడ్డు బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు రూ.121.92కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రభుత్వం జీఓ జారీ చేసింది.

క్షేత్రస్థాయి స్థలాల పరిశీలన

జూరాలకు దిగువ భాగాన కృష్ణానదిపై అదనంగా నిర్మించే హైలెవెల్ బ్రిడ్జి పనులను రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌అండ్‌బీ శాఖకు అప్పగించింది. ఈనేపథ్యంలోనే బుధవారం ఆర్‌అండ్‌బీ శాఖ ఎస్‌ఈలు రాజేందర్, శివకుమార్ ఈఈ, డీఈలు, ఏఈలు, ఇరిగేషన్‌శాఖకు చెందిన ఇంజినీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ధరూరు మండలం రేవులపల్లి, ఆత్మకూరు మండలం నందిమల్ల గ్రామాల మధ్య సుమారు 1.07 కిలో మీటర్ పొడవుతో నిర్మించే ప్రాంతాలను పరిశీలించారు. అదేవిధంగా గద్వాల మండలం కొత్తపల్లి, ఆత్మకూరు మండలం జూరాల మధ్యన సైతం బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు పరిశీలించారు. రెండుచోట్ల ఏదో ఒక ప్రాంతంలో హైలెవెల్ రోడ్డు బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించి సమగ్ర నివేదిక సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

పొంచి ఉన్న ప్రమాదం

జూరాల ప్రాజెక్టుపై రోడ్డు బ్రిడ్జి నిర్మించగా.. దీనిపై వనపర్తి, నారాయణపేట, మహబూబ్‌నగర్, హైదరాబాద్‌కు నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇక్కడే ప్రాజెక్టు ముప్పు ఏర్పడింది. ముఖ్యంగా భారీ లోడుతో ఉన్న వాహనాలు ఈ బ్రిడ్జిపై రాకపోకలను సాగిస్తుండడంతో ప్రాజెక్టు ప్రమాదంలో పడిందని అధికారులు 2019, 2022లో ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. అయినా భద్రతా చర్యలపై అప్పటి ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

జూరాల ప్రాజెక్టు రోడ్డు బ్రిడ్జిపై వాహనాల రాకపోకలు →



మాజీ మంత్రికి స్టేషన్ బెయిల్ మంజూరు

మహబూబ్‌నగర్ క్రైం: గతేడాది అక్టోబర్ 30న వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును ఇటీవల టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు బదలాయింపు అయ్యింది. ఈ ఘటనలో మొత్తం 19 మందిపై కేసు నమోదు కాగా ఇప్పటికే 14 మందికి 41 నోటీసులు జారీ చేయడం జరిగింది. మిగిలిన మరో ఐదుగురు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తోపాటు పల్లె రవి, ఆంజనేయులుగౌడ్, జంబులయ్య, రాజీవ్‌సాగర్‌లకు టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ సమక్షంలో సోమవారం 41 నోటీసులు ఇచ్చి పంపించారు.


పోలీస్‌స్టేషన్‌లో మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు

భూమి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేస్తున్నారని..
మహిళా రైతు ఆత్మహత్యాయత్నం


అధికారులతో మాట్లాడుతున్న బాధిత మహిళా రైతు


పెట్రోల్ డబ్బాను లాక్కొంటున్న పోలీసులు

ఊర్కొండ: అధికార పార్టీ నాయకులతో కొందరు అధికారులు కుమ్మక్కై, తమ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేస్తున్నారని ఓ మహిళా రైతు తహసీల్దార్ కార్యాలయంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండల కేంద్రంలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి బాధితుల కథనం ప్రకారం.. ఊర్కొండపేట శివారు సర్వే నం.220లో ఏ.3.39 ఎకరాల భూమి తమ తాతల కాలం నుంచి స్వాధీనంలో ఉందని మహిళా రైతు శశికళ, శేఖర్‌రెడ్డి తెలిపారు. వాటిలో కోళ్ల ఫారం పెట్టుకొని జీవనోపాధి సాగిస్తున్నామని, అవసరాల కోసం బ్యాంకు రుణం తీసుకొని వన్‌టైం సెటిల్‌మెంట్ చేసుకొని పూర్తిగా చెల్లించామన్నారు. బ్యాంకు వారు తమ భూమి విడుదల చేసినట్లుగా మా వద్ద అన్ని రశీదులు ఉన్నాయన్నారు. అయినప్పటికీ బ్యాంకు తమ మధ్య కోర్టులో మూడేళ్లుగా కేసు నడుస్తుండగా కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ ఎంపీపీ బంధువులు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తమ భూమిని అక్రమంగా పట్టా చేసుకున్నారన్నారు. దీనిని తిరిగి సోమవారం వేరే వాళ్లకు రిజిస్ట్రేషన్ చేస్తున్నారని తెలిసి తహసీల్దార్ కార్యాలయం చేరుకొని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే మహిళా రైతు శశికళ వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకునే ప్రయత్నం చేయగా పోలీసులు జోక్యం చేసుకొని పెట్రోల్ డబ్బాను లాక్కొన్నారు. ఈ ఘటనపై అధికారులు స్పందిస్తూ పూర్తిస్థాయిలో విచారణ చేస్తామని చెప్పారు.

చిరుత జాడలు కనిపెట్టిన అధికారులు


చిరుత జాడను వెతుకున్న అధికారులు


గుహలోకి వెళ్తున్న చిరుత

మహమ్మదాబాద్: మండలంలోని గాధిర్యాల్ అటవీ శివారులో ఓగుట్టపై వారం రోజులుగా చిరుత సంచరిస్తుంది. నిత్యం ఉదయం, సాయంత్ర వేళల్లో ఓ గుండుపైకి ఎక్కి పడుకొని ఉన్న సమయంలో రైతులు చూస్తూనే ఉన్నారు. చుట్టూ ఉన్న రైతులు తమ పశువులకు రక్షణ కరువైందని, భయాందోళన చెందుతూ అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఆదివారం డ్రోన్ కెమెరాతో చిరుత సంచారాన్ని కనిపెట్టారు. గుండుపై నుంచి ఓ గుహలోకి వెళ్లడాన్ని డ్రోన్‌లో చిత్రించారు. సోమవారం ఉదయం అటవీశాఖ బృందం గ్రామస్తులు గుట్టనంతా గాలించగా.. ఓగొర్రెను, కుక్కలను పట్టుకుని తిన్నట్లు పక్కనే ఉన్న ఓ కుంటలోకి వెళ్లి నీళ్లు తాగినట్లు జాడలు గుర్తించారు. ప్రస్తుతం చిరుత ఆ ప్రాంతంలో లేదని, మరుసటిరోజు కూడా ఆచూకీ వెతికి బోను ఏర్పాటు చేస్తామని రైతులకు తెలిపారు. పశువులను భద్రంగా ఉంచుకోవాలని, ఇళ్ల దగ్గరకు తీసుకెళ్లాలని సూచించారు.

ప్రాజెక్టులకు భారీ వరద

జూరాల వద్ద 12 క్రస్టు గేట్ల ఎత్తివేత


జూరాల ప్రాజెక్టు వద్ద 12క్రస్టు గేట్ల నుంచి దిగువకు విడుదలవుతున్న వరద నీరు

ధరూరు: జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో సోమవారం కొంత తగ్గిందని పీజేపీ అధికారులు తెలిపారు. లక్షా 12వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ప్రాజెక్టు 12 క్రస్టు గేట్లను ఎత్తి 79,200 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 29,159 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315, భీమా లిఫ్టు–1కు 1300, ఆవిరి రూపంలో 43 , ఎడమ కాల్వకు 550, కుడి కాల్వకు 285, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 150 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 1.10లక్షల క్యూసెక్కుల నీటిని శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 7.316 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు తెలిపారు.

ఆల్మట్టికి 1.11 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అలాగే, ఎగువన ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 123.081 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులో 88.248 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టుకు 1,11,472 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ప్రాజెక్టు నుంచి దిగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టుకు 1,15,000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు పూర్తి స్థాయి నీటి మట్టం 33.313 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులో 26.936 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టుకు 1,15,00 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 30 క్రస్టు గేట్లను ఎత్తి ప్రాజెక్టు నుంచి దిగువన ఉన్న జూరాలకు ప్రాజెక్టుకు 1,12,577 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

శ్రీశైలం నిండుకుందలా..

దోమలపెంట: ఎగువ ప్రాంతాలు జూరాల, సుంకేసుల నుంచి వస్తున్న వరద ప్రవాహంతో శ్రీశైలం జలాశయం నీటిమట్టం పూర్తి స్థాయి చేరువలోకి వచ్చేస్తుంది. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 885.0 అడుగుల వద్ద 215.8070 టీఎంసీలు కాగా సోమవారం జలాశయంలో 880.8 అడుగుల నీటి మట్టం వద్ద 192.5300 టీఎంసీలుగా ఉంది. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 32,118 మొత్తం 67,433 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 6,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 17.546 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు. కుడిగట్టు కేంద్రంలో 14.612 మి.యూనిట్లు ఉత్పత్తి చేశారు.

11 యూనిట్లలో విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: జూరాల ప్రాజెక్టుకు ఎగువ కర్ణాటక రాష్ట్రం నుంచి వరద భారీగా చేరుతుండడంతో దిగువ, ఎగువ జూరాల జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో విద్యుదుత్పత్తి నిరంతరాయంగా కొనసాగుతుంది. ఈమేరకు సోమవారం 11 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తిని చేపట్టినట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు.

టుడే లీగ్‌లో మహబూబ్‌నగర్ సత్తా

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో సోమవారం ప్రారంభమైన బీ–డివిజన్ టుడే లీగ్ చాంపియన్‌షిప్‌లో మహబూబ్‌నగర్ జట్టు సత్తా చాటి పటిష్ట స్థితికి చేరుకుంది. రాకేష్ లెవన్‌లో జరిగిన మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జట్టు మొదటి ఇన్నింగ్స్ బ్యాటింగ్ చేసి 68.1 ఓవర్లలో 243 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో కొండ శ్రీకాంత్ 71 పరుగులు (87 బంతుల్లో 2 సిక్స్‌లు, 7 ఫోర్లు), బి.సంజయ్ 69 పరుగులు (122 బంతుల్లో 10 ఫోర్లు), అబ్దుల్ రాఫే బిన్ అబ్దుల్లా 41 పరుగులు (89 బంతుల్లో 9 ఫోర్లు) చేసి రాణించారు. రాకేష్ లెవన్ బౌలర్లు నవదీప్ 5, సాత్విక్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన రాకేష్ లెవన్ జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 19.1 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 55 పరుగులు చేసింది. మహబూబ్‌నగర్ బౌలర్ ఎన్.గగన్ 6 ఓవర్లలో 7 పరుగులు ఇచ్చి 4 వికెట్లు తీశాడు. ఇతర బౌలర్లు కొండ శ్రీకాంత్ జస్వంత్ చెరో వికెట్ తీశారు.

జాతీయస్థాయి కిక్‌బాక్సింగ్ పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి కిక్‌బాక్సింగ్ పోటీల్లో జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థులు ప్రతిభ చాటి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. వీరితో పాటు ఆయా విభాగాల్లో పతకాలు సాధించిన విద్యార్థులను సోమవారం జిల్లాకేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు. జాతీయస్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. స్పోర్ట్స్ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె.రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో సీనియర్ విభాగంలో జయదీప్ సింగ్, రోహిత్‌కుమార్‌రెడ్డి, రితిక్‌లు పాయింట్ ఫైట్‌లో బంగారు పతకాలు సాధించి చత్తీస్‌ఘడ్ రాష్ట్రం రాయపూర్‌లో ఈనెల 16 నుంచి 21 వరకు జరిగే జాతీయస్థాయి పోటీలకు, జూనియర్ విభాగంలో శివప్రసాద్, రేవంత్‌లు ఆగస్టులో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సలహాదారులు విజయ్‌కుమార్, సీనియర్ విద్యార్థులు నిఖిల్, యామిని, కావ్య, సాయిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

‘అమరవీరుల త్యాగాలతోనే తెలంగాణ’

- ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు


అమరవీరుల స్థూపాన్ని ఆవిష్కరిస్తున్న ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

తెలకపల్లి: అమరవీరుల త్యాగాలతోనే ప్రత్యేక రాష్ట్రం వచ్చిందని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మండలంలోని ఆలేరులో ఏర్పాటు చేసిన తెలంగాణ అమరవీరుల స్థూపాన్ని ఆయన సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకునే నాటికి తెలంగాణ అప్పు కేవలం రూ.64కోట్లు ఉంటే.. ఆయన పదేళ్ల పాలన పూర్తి చేసుకునే నాటికి రూ.8 లక్షల కోట్లకు పెంచారని ఆరోపించారు. లక్షలాది మంది ఉద్యమాల్లో పాల్గొనడంతో పాటు వేలాది మంది అమరులై సాధించుకున్న తెలంగాణను కేసీఆర్ కుటుంబం దోచుకుందని మండిపడ్డారు. ప్రతి మండల కేంద్రంలో అమరవీరుల స్థూపాలు, ప్రతి గ్రామంలో అంబేద్కర్, గాంధీ విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

కలిసి అభివృద్ధి చేసుకుందాం

ప్రజా ప్రభుత్వంలో ప్రతి పౌరుడు భాగస్వామ్యం వహించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకునేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తుందని, వాటిని ప్రతి ఇంటికి చేర్చాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. రైతు భరోసా, సన్న వడ్లకు బోనస్, రైతు రుణమాఫీ వంటి పథకాలతో అన్నదాతలకు అండగా నిలుస్తున్నామని తెలిపారు. అంతకు ముందు బోనాలు, డప్పులతో గ్రామస్తులు మంత్రికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు దామోదర్‌రెడ్డి, కోదండరాం, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, రాజేష్‌రెడ్డి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే సాగునీటి రంగంపై వివక్ష

అచ్చంపేట రూరల్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సాగునీటి రంగంపై వివక్ష చూపారని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం అచ్చంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ మంత్రి హరీశ్‌రావు కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌పై చేసిన వ్యాఖ్యలు అర్థరహితమన్నారు. చుక్క నీటిని కాంగ్రెస్ ప్రభుత్వం ఆయకట్టుకు నీటిని సరఫరా చేయలేదని చేసిన వ్యాఖ్యలను పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌కు దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో డీపీఆర్ చేసిన 2.5 లక్షల నుంచి 3.5 లక్షలకు పెంచింది వాస్తవమన్నారు. అప్పటికే 2.5 లక్షల ఎకరాలకు సంబంధించిన కాల్వ పనులు దాదాపుగా పూర్తయిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మాజీ సీఎం కేసీఆర్ కుర్చీ వేసుకొని కూర్చొని పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలను పూర్తి చేస్తానని ఇచ్చిన మాట బుట్టదాఖలైన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. పాలమూరు జిల్లా ప్రజలను బీఆర్‌ఎస్ నాయకులు మోసం చేశారని ఆరోపించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


మృతుడు భాను (ఫైల్)

కల్వకుర్తి టౌన్: బైక్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ఘటనలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన సోమవారం కల్వకుర్తిలో చోటుచేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలిలా.. మున్సిపాలిటీలోని జేపీనగర్ వద్ద నివాసముండే భాను (33) తన సొంత పనుల నిమిత్తం పట్టణానికి బైక్‌పై వచ్చాడు. పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వెళుతుండగా గాంధీనగర్‌లోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద బైక్ అదుపుతప్పి.. పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. తీవ్రగాయాలైన యువకుడిని స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లుగా వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీకి తరలించామని, ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, అందిన వెంటనే దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు. మృతుడికి భార్యతో పాటుగా నెల వయస్సున్న కుమారుడు ఉన్నారు.

మనస్తాపంతో పురుగుమందు తాగాడు

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి


శివయ్య (ఫైల్)

కల్వకుర్తి రూరల్: మండలంలోని గుండూరుకు చెందిన మొగిలి శివయ్య (74) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ఒడిగట్టిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. శివయ్య ఆదివారం పీర్ల వద్దకు వెళ్లి పీర్ల ఊరేగింపు చూసే సమయంలో కిందపడి గాయాలపాలయ్యాడు. ఇంటికి చేరుకుని తాను అన్నివిధాలుగా ఇబ్బందులు పడుతున్నానని మదనపడుతూ మనస్తాపానికి గురయ్యాడు. ఇంట్లోనే అర్ధరాత్రి పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వేకువజామున కుటుంబ సభ్యులు గమనించి కల్వకుర్తి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఉదయం 7గంటల ప్రాంతంలో తుదిశ్వాస విడిచాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మాధవరెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

యువతిని మోసం చేసిన యువకుడిపై కేసు

మాగనూర్: ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన యువకుడిపై కేసు నమోదైన సంఘటన సోమవారం నేరడగంలో చోటుచేసుకుంది. ఎస్ఐ అశోక్‌బాబు వివరాల ప్రకారం.. మండలం నేరడగం గ్రామానికి చెందిన యువతి(20) అదే గ్రామానికి చెందిన యువకుడు(25) ఇరువురు సంవత్సరం కాలంగా ప్రేమించుకుంటున్నారు. ప్రేమపేరుతో సదరు యువతిని నమ్మించి గర్భవతిని చేశాడు. ప్రస్తుతం యువతి పెళ్లి చేసుకోవాలని కోరగా అందుకు యువకుడు నిరాకరించాడు. దీంతో యువతి మాగనూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

శిశుమందిర్‌కు ప్రొజెక్టర్ వితరణ



ఊట్కూరు: ఊట్కూరులోని సరస్వతి శిశుమందిర్‌కు సోమవారం బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ గౌడ్ విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు ప్రొజెక్టర్‌ను అందజేశారు. పాఠశాల కమిటీ తరపున శాలువాతో ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో శిశుమందిర్ గౌరవాధ్యక్షుడు ఎం భాస్కర్, మాజీ సర్పంచ్ నింగిరెడ్డి, నాయకులు శేషప్ప, రమేష్, రణవీర్ పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



మాగనూర్: తొలిఏకాదశిని పురస్కరించుకొని మాగనూర్ మండల కేంద్రంలో వెలసిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయం దగ్గర భక్తులకు కమిటీ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు రమేష్‌గౌడ్ మాట్లాడుతూ.. స్థానిక శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ప్రతి పౌర్ణమికి పల్లకీసేవ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే ఆలయంలో భక్తుల సౌకర్యార్థం భక్తి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగానే తొలి ఏకాదశిని పురస్కరించుకుని అన్నదానం నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్ని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బాలికల వసతి గృహం ఏర్పాటు చేయాలి

మాగనూర్: మాగనూర్‌లో బాలిక వసతి గృహం ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. మండల కేంద్రానికి మారుమూల గ్రామాల నుంచి రవాణా సౌకర్యం లేక బాలికలు ఉన్నత స్థాయి విద్య మధ్యలోనే ఆపేసి, బాల్యవివాహాల వైపు ప్రోత్సహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇక్కడ ఉన్న బాలిక వసతి గృహంను సొంత బిల్డింగ్ లేదనే నేపంతో మక్తల్‌కు తరలించడం జరిగిందని, బాలికల చదువు మధ్యలో ఆగిపోకుండా ఉన్నత చదువులు చదివేలా ప్రోత్సాహం అందించేందుకు మాగనూర్‌లో బాలికల వసతి గృహం ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

'బస్ సౌకర్యం కల్పించండి'



ధన్వాద: రోజు పాఠశాలకు, కళాశాలకు వెళ్లాలంటే ప్రైవేట్ వాహనాల్లో, కాలినడకన మరికల్ వరకు రావల్సిన పరిస్థితి మంత్రోనిపల్లి గ్రామస్తులది. మండలంలోని మంత్రోనిపల్లి గ్రామానికి ఏర్పాటు చేసిన ఆర్టీసి బస్ కొంత కాలంగా బంద్ చేయడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంత్రోనిపల్లి గ్రామం నుంచి గున్ముక్ల అక్కడి నుంచి మరికల్‌కు 15 కిలోమీటర్ల దూరం ఉంది. విద్యార్థులకు నడిచి వెళ్లే పరిస్థితి ఉండడంతో బస్ సర్వీస్ పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

10న రక్తదాన శిబిరం

నారాయణపేట రూరల్: గురు పూర్ణిమను పురస్కరించుకుని 10న స్నేహమిత్ర మండలి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు డాక్టర్ మదన్ మోహన్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని హనుమాన్ సాయి మందిరంలో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు క్యాంపు కొనసాగుతుందని, యువత, విద్యార్థులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై రక్తదానం చేయాలన్నారు. అదేవిధంగా 25సార్లకు మించి రక్తదానం చేసిన వారికి సన్మానం చేస్తున్నట్లు తెలిపారు.



ఇనుప కంచెతో కొత్తపల్లి పాఠశాల



ఇనుప కంచె ప్రహరీతో పగిడిమారి పాఠశాల

పాఠశాలలకు ప్రహరీ లేక ఇక్కట్లు

- ఆవరణలోకి కుక్కలు, పశువులు
- పలు పాఠశాలలకు ఇనుప కంచె ఏర్పాటు
- ఆవరణలో మొక్కలకు రక్షణ కరువు

ఊట్కూర్: ప్రభుత్వ పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మించినా ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారు. పాఠశాలల్లో నాటిక మొక్కలకు రక్షణ లేకుండాపోతోంది. మండలంలో 6 ఉన్నత పాఠశాలలు, 13 యూపీఎస్ పాఠశాలలు, 23 ప్రైమరీ పాఠశాలలు ఉన్నాయి. పెద్దజట్రం ఉన్నత పాఠశాల, కొత్తపల్లి, వల్లంపల్లి, పగిడిమారి; తిమ్మారెడ్డిపల్లి తండా, ఎర్గాట్‌పల్లి, అవుసలోనిపల్లి, ఊట్కూర్ పీఎస్ ఉర్దూ మీడియం తదితర పాఠశాలలకు పక్కా భవనాలు ఉన్నా ప్రహరీలు నిర్మించలేదు. దీంతో పలు గ్రామాలలోని పాఠశాలలకు గ్రామస్తుల సహకారంతో ఉపాధ్యాయులు తాత్కాలికంగా ఇనుప కంచెను ఏర్పాటు చేశారు. ప్రహరీలు లేకపోవడంతో పాఠశాల సమయంలో పశువులు, మేకలు, కుక్కలు తిరగాడుతున్నాయి. పాఠశాల ఆవరణలో నాటిన మొక్కలకు మేకల వల్ల రక్షణ లేకుండాపోతోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలలకు ప్రహరీ నిర్మించాలని ఆయా గ్రామాల విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



ప్రహరీ లేని వల్లంపల్లి పాఠశాల

ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తా..

మండలంలోని పలు పాఠశాలలకు ప్రహరీల నిర్మాణం లేదని తెలుస్తోంది. పాఠశాలలను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాను. నిధులు వచ్చిన వెంటనే ప్రహరీల నిర్మాణానికి కృషి చేస్తాను.

– మాధవి, ఎంఈఓ

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ



పెద్దచింతకుంటలో ఇందిరమ్మ ఇళ్లకు పూజ చేస్తున్న నాయకులు



కొత్తపల్లి తండాలో ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్ వేస్తున్న అధికారులు

మరికల్: మండలంలోని పెద్దచింతకుంట గ్రామంలో అర్హులైన లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్లకు కార్యదర్శి జ్యోతి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. దశల వారీగా అర్హులైన వారందరికి ప్రభుత్వం అందజేసిన ఇళ్లకు ముగ్గు వేసి ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అంజిరెడ్డి, సోమిరెడ్డి, రాజు, శేఖర్, రవి పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండలంలోని కొత్తపల్లితండాలో ఇందిరమ్మ ఇళ్లకు ఎంపీడీఓ కృష్ణారావు, హౌసింగ్ ఏఈ శాంత కుమార్, పంచాయతీ కార్యదర్శి అజయ్ ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్ వేశారు. లబ్ధిదారులకు ఇంటి అనుమతి పత్రాలు అందజేశారు. లబ్ధిదారులు ప్రభుత్వం నిర్ణయించిన కొలతల మేరకు నిర్మించుకోవాలని, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు మూడు విడతల్లో అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



పాఠశాల ఆవరణలో బ్లీచింగ్ చల్లుతున్న మున్సిపల్ సిబ్బంది

కోస్గి: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు. 100 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం పట్టణంలోని 11వ వార్డులో తడి పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిపొడి చెత్తను వేరువేరు బుట్టలలో వేయాలని, తడి చెత్త నుంచి ఎరువులు తయారు చేయవచ్చన్నారు. వస్తువుల వినియోగానికి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి బట్ట సంచులను వాడాలన్నారు. అమృత్‌జల్ పథకం ద్వారా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామన్నారు. వార్డు ప్రజల సమస్యలు త్వరగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మేనేజర్ అనిల్‌కుమార్, హెల్త్‌అసిస్టెంట్ మొహిన్‌బాషా, బాలేష్, మున్సిపల్ అధికారులు, మెప్మా సిబ్బంది ఉన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

నారాయణపేట రూరల్: యువత పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఏబీవీపీ నాయకులు అన్నారు. సంఘం 77వ ఆవిర్భావ వారోత్సవాలను పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రంలోని చౌక్ బజార్ నుంచి స్వామి వివేకానంద మున్సిపల్ పార్క్ వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజురోజుకు వాహనాల సంఖ్య పెరగడం వల్ల వాతావరణ కాలుష్యం పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు మొక్కలు నాటాలని, వాహనాల వినియోగాన్ని తగ్గించాలని కోరారు. యువత ప్రతి గ్రామంలో అవగాహన కల్పించేందుకు కృషి చేయాలన్నారు. సైకిల్ నడపడం వల్ల కాలుష్య నివారణతో పాటు ఆరోగ్యాన్ని సంపాదించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సతీష్, వెంకటేష్, ఇంతియాజ్, వివేకానంద, అరుణ్, మురళి, అనిల్, వంశీ పాల్గొన్నారు.



నారాయణపేటలో సైకిల్ ర్యాలీ నిర్వహించిన ఏబీవీపీ నాయకులు

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



ధన్వాడలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు, పాల్గొన్న అఖిలపక్ష నాయకులు

ఊట్కూరు: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం ఊట్కూరులోని అంబేడ్కర్ కాంప్లెక్స్ దగ్గర మండల ఇన్‌చార్జి కొక్కు శంకర్ ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం మంద కృష్ణ మాదిగ 61వ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నారాయణ, తిమ్మప్ప, భరత్, సాయిలు, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత చదువులు చదివించాలి

ధన్వాద: దళితులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించి, ఇతరులకు ఉద్యోగం కల్పించే స్థాయికి ఎదిగేలా చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు తిమ్మయ్య అన్నారు. మండల కేంద్రంలోని జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామ్మోహన్, నర్సింహులు, అఖిలపక్ష పార్టీ నాయకులు, ఉమేష్, రాంచంద్రయ్య, గోవర్ధన్‌గౌడ్, రాజు, శంకర్, బాలయ్య పాల్గొన్నారు.

హక్కులు సాధించుకోవాలి

కోస్గి రూరల్: భారత రాజ్యాంగ పరంగా లభించే అన్ని హక్కులను సాధించుకొని అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కనకప్ప అన్నారు. పట్టణంలోని శివాజీ చౌరస్తాలో జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బ్యాగరి రాములు, కెపి వెంకటయ్య, పోశప్ప, మొగులప్ప, వెంకటయ్య, సాయిలు ఉన్నారు.

దండోరా జెండావిష్కరణ

నారాయణపేట రూరల్: మండలంలోని తిరుమలాపూరులో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో దండోరా జెండాను ఆవిష్కరించారు. మందకృష్ణ కృషి ఫలితంగా మాదిగలకు న్యాయం జరిగిందన్నారు. కనకప్ప, అనిల్, సాయి, అరుణ్, చింటు, కల్యాణ్, శ్రీను, గణేష్ పాల్గొన్నారు.

పంట రుణమాఫీ చేయండి



నారాయణపేట: పంట రుణమాఫీ కాని రైతులకు వెంటనే రుణ మాఫీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోపాల్ డిమాండ్ చేశారు. సోమవారం దామరగిద్ద మండలం క్యాతన్ పల్లి, ఉడ్మల్‌గిద్ద గ్రామాలకు చెందిన పంట రుణమాఫీ కాని రైతులతో కలిసి కలెక్టర్ సిక్తాపట్నాయక్‌కు, వరిధాన్యం బోనస్‌ను చెల్లించాలని కోరుతూ జిల్లా అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌కు వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రతి కుటుంబానికి రెండు లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చాక కొర్రీలు పెట్టి రుణమాఫీ చేయకుండా రైతులను మోసం చేసిందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇంకా 28వేల మంది రైతులకు రుణమాఫీ చేయలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు శివకుమార్, రైతులు దామోదర్, వెంకటప్ప, రంగప్ప, మాణిక్యప్ప గౌడ్, మైబు, శ్రీను, వీరప్ప పాల్గొన్నారు.

ప్రైవేట్ సంస్థల్లో ఫీజులు నియంత్రించాలి




ధన్వాద: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసి ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలలో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని పీడీఎస్‌యూ మండల అధ్యక్షుడు మహేష్ అన్నారు. సోమవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో తహసీల్దార్ సింధుజాకు వినతి పత్రం అందజేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో విచ్చలవిడిగా ఫీజులు పెంచుతున్న పరిస్థితి ఉన్నప్పటికీ విద్యాశాఖ అధికారులు స్థానిక అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు సురేష్, శివ, రమేష్ పాల్గొన్నారు.

జూనియర్ కాలేజీ భవన నిర్మాణం పరిశీలన



కొత్తపల్లి: మండలంలోని భూనీడు గ్రామంలో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీ భవన నిర్మాణ పనులను సోమవారం ఎంపీడీఓ కృష్ణారావు, మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డితో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. నియోజకవర్గంలో నూతన మండలాలు ఏర్పాటు కావడంతో ప్రతి మండలంలో ఓ జూనియర్ కాలేజీ ఉండాలనే ఉద్దేశంతో సీఎం చొరవతో రూ.5 కోట్లతో భవనం మంజూరు చేశా రు. భవన నిర్మాణ పనులు కొనసాగుతుండడంతో సోమవారం మండల అధికారులు నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతను పాటించాలని, నిర్మాణ పనులు ఇచ్చిన గడువులోగా పూర్తి చేసేందుకు పనుల్లో వేగం పెంచాలని సూచించారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం



నారాయణపేట రూరల్: నూతనంగా ఎన్నుకోబడిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావును ఆ పార్టీ జిల్లా నాయకులు సోమవారం కలిశారు. ఎస్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు రాము నాయక్ ఆధ్వర్యంలో పలుగురు గిరిజన నాయకులు కొత్త అధ్యక్షుడిని శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎస్టీల సమస్యలు, తండాల్లోని ఇబ్బందులను తెలిపారు.

ముగిసిన మొహర్రం పండుగ



ధన్వాడలో అలాయ్ బలాయ్ ఆడుతున్న యువకులు

ధన్వాద/నర్వ: మండల కేంద్రంలో హసన్ హుసేన్, బీంపాతీమ పీర్ల సవారీ పండుగ సోమవారం ఘనంగా నిర్వహించారు. మసీదులో పదిరోజుల క్రితం ప్రతిష్ఠించిన హసన్ హుసేన్, బింపాతీమ పీర్లకు నవమి సవారీ సందర్భంగా ఆదివారం మధ్యరాత్రి 1 గంటలకు లక్ష్మీవాడలో భక్తులు అగ్నిగుండంలో నడుచుకుంటు వెళ్లి తమ కోరికల తీర్చాలని పార్థించారు. అనంతరం మారుతినగర్ వీధిలో బుదరపు సత్యనారాయణ కుటుంబీకులు ఏర్పాటు చేసిన ఊయాలను బీంపాతీమ పీరు ఊపి బాలుడికి నామకరణం చేశారు. అనంతరం మసీదుకు వెళ్లి చల్లపడిన పీర్లు సాయంత్రం తిరిగి వచ్చి ఊయాలను మరల ఊపి డోలారోహణం చేసి జోలపాటలు పాడారు. సా యంత్రం డప్పులు వాయిస్తు పూరవీధుల గుండా హుసేన్, బీంపాతీమ పీర్ల సవారీగా ఊరేగించారు. గ్రామ పురవీధుల్లో గుండా యువకులు డబ్బులు కొడుతూ అలాయ్ ఆడారు. ముందుగా హసేన్ హు స్సేన్ పీర్లను సందర్శంచుకొని తమ మొక్కులు తీ ర్చుకున్నారు. మహిళలు బొడ్డెమ్మలు వేశారు. ధన్వాడ మండలంలోని గోటూర్‌లో పీర్ల పండుగ ఘనంగా కొనసాగింది. మూడు రోజులుగా పీర్ల పండుగ నిర్వహించారు.



గోటూర్‌లో యవకుల అలాయ్ బలాయ్

నిమజ్జనానికి (షాహదత్) తరలిన పీర్లు

కొత్తపల్లి: మడలంలో తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న పీర్లు నిమజ్జనానికి తరలివెళ్లాయి. మండలంలోని కొత్తపల్లి, నిడ్జింత, భూనీడు, తదితర గ్రామాల్లోని పీర్ల చావిడిల దగ్గర ప్రతిష్ఠించిన పీర్లకు కులమతాలకతీతంగా పూజలు నిర్వహించారు. మాలీజా, పూలు, ఊదు, దట్టీలు పీర్లకు సమర్పించారు. నిమజ్జనం సందర్భంగా కొత్తపల్లి, నిడ్జింత గ్రామాలకు చెందిన పీర్లు నిడ్జింత గుట్టపై ఉన్న దర్గా దగ్గర అలాయ్ బలాయ్ తీసుకున్నారు. అనంతరం నిమజ్జనానికి తరలివెళ్లాయి.



నిడ్జింతలో అలాయ్‌బలాయ్ తీసుకుంటున్న పీర్లు

వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలి

ఊట్కూరు: మండలంలోని అన్ని గ్రామాలలో అంటువ్యాధులు సోకకుండా తగు చర్యలు తీసుకోవాలని సోమవారం ఎంపీడీఓ ధనుంజయగౌడ్‌కు పీఓడబ్ల్యూ జిల్లా నాయకురాలు సావిత్రమ్మ వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కావడంతో అనేక మంది సీజన్‌వ్యాధులు సోకి ఆస్పత్రి పాలవుతున్నారన్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్, అతిసార తదితర వ్యాధులు సోకే ప్రమాదం ఉందని తెలిపారు. గ్రామాలలో సరిగ్గా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నిలువ ఉండి దోమలు, ఈగలతో అంటువ్యాధులు సోకవచ్చని తెలిపారు. అధికారులు స్పందించి మండలంలోని అన్ని గ్రామాలలో మురుగు కాల్వలు శుభ్రం చేసి దోమల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు సిద్దు, చెన్నప్ప, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.



ఊట్కూరులోని ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలి

మాగనూర్: కేంద్రం కొత్తగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లకు నిరసనగా జూలై 9న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు వంట కార్మికులతో కలిసి ఎంఈఓ మురళీధర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు పి.ఆంజనేయులు మాట్లాడుతూ కేంద్రం 44 కార్మిక చట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. ఈ కోడ్‌లు జూలై నుంచి అమలు చేయడానికి కేంద్రం చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. వెంటనే నాలుగు కార్మిక చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వంట కార్మిక సంఘం నాయకురా లు ప్రమీల, సంతోషి, గౌసియా, నరసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ధన్వాద: 9న జరగబోయే కార్మికుల సార్వత్రిక సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని ఏఐయూటీసీ నారాయణపేట జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్ కోరారు. మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమ్మె నోటీసులను యజమానులకు అందజేశారు. కార్యక్రమంలో భాను, రాజు, రాములు, బాలస్వామి, కతలప్ప, మల్లేష్, నరసింహులు, కురుమూర్తి, చెన్నప్ప, బాల నరసింహులు పాల్గొన్నారు



ధన్వాడలో యజమానులకు నోటీసులు అందజేస్తున్న ఏఐయూటీసీ నాయకులు

పోస్టర్ విడుదల

మక్తల్: 9న దేశ వ్యాప్తంగా చేపట్టిన సార్వత్రిక సమ్మె సందర్భంగా మక్తల్‌లో టీయూపీఐ ఆధ్వర్యంలో రాష్ట్ర కోశాధికారి కిరణ్ పోస్టర్ విడుదల చేశారు. మక్తల్‌లో ప్రైవేటు బస్ డ్రైవర్ల యూనియన్ సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అనిల్, వెంకట్‌రెడ్డి, కనకయ్య, రవిగౌడ్, రాఘవేంద్ర, భీమన్న, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు ఇబ్బంది లేకుండా చూడాలి

నారాయణపేట: నారాయణపేట పట్టణంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిని అక్కడి నుంచి అప్పక్‌పల్లి నూతన భవనంలోకి ఇటీవల మార్చడంతో రోగులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సోమవారం ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆదిత్య గౌడ్‌ను వారి కార్యాలయంలో భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్ కుమార్ రెడ్డి ఫౌండేషన్ సభ్యులతో కలిసి కోరారు. అందుకు డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఆదిత్య గౌడ్ స్పందిస్తూ.. ఆస్పత్రిలో రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని తెలిపారు. ఆస్పత్రికి ప్రతి 15 నిమిషాలకు ఒక ఆర్టీసీ బస్సు నడుస్తుందని వివరించారు. ఆస్పత్రికి రోగుల వెంట వచ్చేవారు కూర్చునేందుకు కుర్చీలు లేవని, భీష్మరాజ్ ఫౌండేషన్ తరుపున కుర్చీలను అందజేయాలని కోరగా, అందుకు రాజ్ కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. త్వరలోనే కుర్చీలను అందజేస్తామని హామీనిచ్చారు. డిప్యూటీ సూపరింటెండెంట్ ను కలిసిన వారిలో ఫౌండేషన్ సభ్యులు గడ్డం తిప్పన్న, మధుసూదన్ రెడ్డి, హన్మంతు ముదిరాజ్, నర్సింహానాయుడు, శివరాజ్, ఎం.సంతోష్, మన్నె గోపాల్, వై.సంతోష్, నందుకుమార్, ఆశోక్, శ్రీనివాస్, నాగురావు, నర్సింహ, కృష్ణ యాదవ్, రాజు, రాము తదితరులు ఉన్నారు.



ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు విన్నవిస్తున్న భీష్మరాజ్ ఫౌండేషన్‌చైర్మన్, సభ్యులు.


కస్తూర్బా విద్యార్థులకు వైద్య పరీక్షలు

దామరగిద్ద: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులు జ్వరంతో అస్వస్థతకు గురవుతుండడంతో సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ప్రత్యేక క్యాంపు నిర్వహించి వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్ స్రవంతి సిబ్బందిలో కలిసి 48 మంది విద్యార్థులకు పరీక్షలు చేయగా, 11 మందికి స్వల్ప జ్వరం, జలుబు, దగ్గు లక్షణాలున్నట్లు గుర్తించామన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నారాయణ, సూపర్‌వైజర్ కృష్ణమ్మ, పాఠశాల ఎస్ఓ స్వాతి పాల్గొన్నారు.

విద్యార్థుల డాటా నమోదు

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ఎంఈఓ బాలాజీ ఆ ధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు పాఠశాలల వారీగా ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. యూ డైస్‌లో జీపీ, ఈపీ, ఎఫ్‌పీ అంశాల గురించి వివరించారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



ఊట్కూరు: ఊట్కూరులోని చెక్‌పోస్టు దగ్గర ఆర్ అండ్‌బీ అధికారులు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని సోమవారం ఎక్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటరమణకు ఎంపీజే ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎంపీజే జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ మక్తల్ నారాయణపేట రహదారిపై నిత్యం వందలాది వాహనాల రాకపోకలు నిర్వహిస్తున్నారని స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో చెక్‌పోస్టు ప్రాంతంలో వాహనాలు వెళ్లడం ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. నిత్యం ఇసుక టిప్పర్లు, బూడిద వాహనాలు వేగంగా వెళ్తుంటాయని తెలిపారు. అధికారులు స్పందించి చెక్‌పోస్టు దగ్గర ప్రధాన రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. స్పీడ్ బ్రేకర్లు వేయడానికి చర్యలు తీసుకుంటామని అధికారి హామీ ఇచ్చారు.